ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య జిల్లా వార్తలు
5
గురువారం 11 జులై 2024



ఆక్రమణలపై గురి

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూఆక్రమాలు
- తిరిగి స్వాధీనం చేసుకోనున్న భూములు
- గతంలో పనిచేసిన అధికారులకే బాధ్యతలు..
- అధికారులను ఆదేశించిన మంత్రి మండిపల్లి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయచోటి నియోజకవర్గ పరిధిలో వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వైసీపీ నాయకులు ఈ భూములను కాజేశారు. తరాలుగా పేదల అనుభవంలో ఉన్న భూములు సైతం రాత్రికి రాత్రే వైసీపీ నాయకుల పేర్లతో రికార్డుల్లోకి ఎక్కిపోయాయి. లంచాలకు ఆశపడి కొన్నిచోట్ల, అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో కొన్ని చోట్ల అధికారులు ఈ అక్రమాలకు సహకరించారు. తమ తాతముత్తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుంటూ ఉన్నాం.. ఆ భూములను మా ఊరికి చెందిన వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. సాయం చేయండని.. ఎందరో పేదలు తహసీల్దార్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎటువంటి ఫలితం లేదు. ఆక్రమించుకున్న భూముల్లో వైసీపీ నాయకులు పలుచోట్ల దర్జాగా మామిడి చెట్లు నాటారు. ఆ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దీంతో చేసేదేమీ లేక.. పేదలు మౌనంగా ఉండిపోయారు. అదేవిధంగా చాలాచోట్ల వందల ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి అక్రమ భూవ్యవహారంపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టి సారించారు. ఇలా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వైసీపీ నాయకుల కబంధ హస్తాల బారి నుంచి విడిపించాలని కలెక్టర్‌కు లేఖ రాశారు. సోమవారం స్వయంగా తానే సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో పర్యటించి.. వైసీపీ నాయకుల ఆక్రమణలో ఉన్న భూములను పరిశీలించారు. ముల్లును ముల్లుతోనే తీయాలనే విధంగా అప్పుడు వైసీపీ నాయకులకు సహకరించిన అధికారులతోనే ఈ ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని చూస్తుండడం విశేషం.

ఆక్రమణలో వేల కోట్ల రూపాయల భూములు

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రాయచోటికి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ భూముల ధరలు సీజన్‌తో సంబంధం లేకుండా చుక్కల్లో ఉంటాయని చెప్పవచ్చు. దీంతో వైసీపీ నాయకుల కళ్లు భూములపైన పడ్డాయి. రెవెన్యూ అధికారులను నయానో.. భయానో.. బెదిరించుకుని.. వందల ఎకరాలు ప్రభుత్వ భూములను ఆక్రమించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఆ పొలాల్లో పలుచోట్ల మామిడి మొక్కలు నాటి.. చుట్టూ కంచె వేసి.. ఇక తమనెవరూ ఏమీ చేయలేరనే ధీమాతో ఉన్నారు. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో రాయచోటి మునిసిపాలిటీ అనుకుని ఉన్న పెమ్మాడపల్లె, దిగువఅబ్బవరం, శిబ్యాల, మాసాపేట, ఒరిగె, గొర్లముదివీడు గ్రామాల పొలాలు ఉన్నాయి. దాదాపు ఇవి రాయచోటి పట్టణానికి సమీపంలోనే ఉన్నాయి. దీంతో పలువురు వైసీపీ నాయకులు పై గ్రామాల్లోని భూములను ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములు కోట్ల రూపాయల విలువ చేస్తాయని చెప్పవచ్చు. జిల్లా కేంద్రం కావడంతో అనేక ప్రభుత్వ కార్యాలయాలు కొత్తగా ఏర్పడ్డాయి. ప్రత్యేకించి.. ఈ కార్యాలయాల సమీపంలో పలుచోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా జగనన్న కాలనీల సమీపంలోనూ ఇదే తరహాలో పలుచోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. చెర్లోపల్లె గ్రామ పరిధిలో కంచాలమ్మగండి వద్ద ఏర్పాటు చేయనున్న నగరవనం సమీపంలో పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ స్థలం సమీపంలో కూడా ప్రభుత్వ భూములను ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇవేకాక ప్రభుత్వ భూములని చూపుతూ.. రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసిన స్థలాలు సైతం ఆక్రమణకు గురయ్యాయి. రామాపురం మండల పరిధిలో కూడా జాతీయ రహదారి సమీపంలో పలుచోట్ల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి.

చిన్నమండెం మండల కేంద్రం నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువ చేసే సర్వే నెంబరు 285/3ను గత ప్రభుత్వంలో కొందరు ఆక్రమించుకుని.. విలాసవంతమైన భవనాలు నిర్మించారు. మదనపల్లె రోడ్డులోని ఇస్మాయిల్ గుట్ట దగ్గర వేసిన లే అవుట్‌లోనూ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. వండాడి నుంచి కేశాపురం వరకు జాతీయ రహదారి అనుకుని పలుచోట్ల ఎంతో విలువైన ప్రభుత్వ భూములు కొందరి ఆక్రమణలో ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు..

ఇప్పటికే సంబేపల్లె మండల పరిధిలో పలుచోట్ల ఆక్రమణకు గురైన భూముల వివరాలను అధికారులు సిద్ధం చేశారు. దేవపట్ల వడ్డిపల్లె సమీపంలో సర్వే నెంబరు 509లో వాగు పోరంబోకు 4.44 ఎకరాలు ఆక్రమించి చుట్టూ కూసాలు నాటారు. గంగా హోటల్ సమీపంలో సర్వే నెంబరు 1257లో 4,5,6,7 లెటర్లలో, 1257 1,3 లో, 1254 సర్వే నెంబర్లలో సుమారు 30 ఎకరాలు డీకేటీ భూమి ఆక్రమించినట్లు గుర్తించారు. ఎస్.సోమవరం గ్రామంలో 358 సర్వే నెంబరులో 3.02 ఎకరాలు, 359లో 2.50 ఎకరాలు, 360లో 7.67 ఎకరాలు, 361లో 3.20 ఎకరాలు, 380లో 4.05 ఎకరాలు, 381లో 5.41 ఎకరాలు, 114లో 8.06 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు. సంబేపల్లె గ్రామంలో సర్వే నెంబరు 120/2లో 1.97 ఎకరాలు, 120/3లో 2.02 ఎకరాలు, 120/4లో 3.11 ఎకరాలు, దేవపట్ల గ్రామంలో 1297లో 3.82 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయినట్లు గుర్తించారు. ఇవేకాక.. ఇంకా ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారో..? వెలికితీయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ముల్లును ముల్లుతోనే..

ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్నికల కోసం వచ్చిన తహసీల్దార్లే విధుల్లో ఉన్నారు అయితే డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వోలు దాదాపు అందరూ రెండు మూడేళ్లుగా అక్కడే పనిచేస్తూ ఉన్నారు. అప్పట్లో వైసీపీ నాయకులు చేసిన భూబాగోతంలో వీళ్ల పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆక్రమణలు వెలికితీయడం వీళ్లకైతేనే సులువుగా ఉంటుందనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూఆక్రమణల లోగుట్టు వెలికితీసే బాధ్యతను వీళ్లకే అప్పగించనున్నట్లు సమాచారం. అదేవిధంగా దాదాపు ప్రతి మండలంలోనూ.. విలువైన రికార్డులు మాయం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రికార్డుల మాయంపైనా అధికారులు దృష్టి సారించి విచారణ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



సంబేపల్లెలో వైసీపీ నాయకులు ఆక్రమించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి (ఫైల్)



చిన్నమండెం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడం

అనుమతులు లేక అటవీ ప్రాంతంలో ఆగిన డబుల్ రోడ్డు పనులు



ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..!

- రాయచోటి-పింఛా రోడ్డు నరకానికి నకళ్లు
- అటవీ ప్రాంతంలో ఆగిన రోడ్డు పనులు

సుండుపల్లె, జూలై 10: పింఛా నుంచి రాయచోటికి వెళ్లే ప్రధాన రహదారి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. రాయచోటి నుంచి జీకే రాచపల్లె వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభించి.. కొంత మేర పనులు చేసినా అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో వాటిని ఆపేశారు. దీంతో ఈ రహదారి గుంతలమయమై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాయచోటి సమీపంలోని సద్దికోళ్లవంక నుంచి సుండుపల్లె మండలంలోని జీకే రాచపల్లె వరకు 20 కిలోమీటర్ల మేర రూ.35 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు 60 శాతం పనులు జరిగాయి. అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో అనుంపల్లె అడవిలో పనులు ఆగిపోయాయి. కాగా, ఈ రహదారిలో నిత్యం రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా ప్రాంతాలకు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా కోతకు గురైంది. దీంతో ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కనీసం మట్టిని వేసేందుకు సైతం అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని డబుల్ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో అనుమతులు రాలేదు..

అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేసేందుకు గత ప్రభుత్వంలో అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనుమతులు రాగానే త్వరితగతిన పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తాము.

- గిరీశ్వర్‌రావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



కోతకు గురైన రాయచోటి ప్రధాన రహదారి

భూమి అమ్మకుంటే.. శ్మశానం చేస్తాం..!

- వైసీపీ నేతల బెదిరింపులపై ఎమ్మెల్యేకు బాధితుల ఫిర్యాదు

మదనపల్లె టౌన్, జూలై 10: మా భూమిని విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నారు. అమ్మకుంటే శవాలు పాతిపెట్టించి శ్మశానం చేస్తామని కొత్తవారిపల్లె, సీటీఎం గ్రామాలకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు బెదిరిస్తున్నారంటూ బాధితులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎమ్మెల్యే తన నివాసంలో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితురాలు అల్లాడి శ్రీలక్ష్మి, ఆమె భర్త ఏసువర్ధన్ మాట్లాడుతూ మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు సమీపంలోని 99 సెంట్ల భూమిని 2018లో రామకృష్ణారెడ్డి అనే రైతు నుంచి కొనుగోలు చేశామన్నారు. ఈ భూమి చుట్టూ సిమెంటు బల్లలతో కాంపౌండు నిర్మించుకున్నామని, కాని సీటీఎం క్రాస్, కొత్తవారిపల్లె పంచాయతీలకు చెందిన ఇద్దరు వైసీపీ ప్రజాప్రతినిధులు ఈ భూమిని తక్కువ ధరకే తమకు విక్రయించాలని బలవంతం చేశారన్నారు. తాము ఒప్పుకోకపోవడంతో కాంపౌండును



తొలగించి, చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా చనిపోతే వారిని తమ భూమిలో పాతిపెట్టించి శ్మశానవాటికగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఫిర్యాదు చేశారంటే తప్పుడు కేసులు పెడతామని బెదిరించారన్నారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు శ్రీలక్ష్మి, ఏసువర్ధన్ ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని మండల సర్వేయర్ సుబ్రమణ్యంకు ఎమ్మెల్యే సూచించారు.

విద్యుత్ చార్జీలపై స్పష్టత ఇవ్వండి

- తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 10: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్‌రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారని.. అయితే ఇందులో విద్యుత్ చార్జీలు పెంచుతారా లేక తగ్గిస్తారా అనే విషయంలో స్పష్టత లేదని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చెప్పారే తప్ప భవిష్యత్తులో చేయబోయే వాటిపై స్పష్టత లేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనే పెంచం, ఇంకా తగ్గిస్తామని జగన్‌రెడ్డి అన్నారన్నారు. ప్రజలు నమ్మి ఓటేశారని అయితే ఆయన అధికారంలోకి వచ్చాక ఫ్లేట్ ఫిరాయించారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఎనిమిదిసార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32,166కోట్ల అదనపు భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడిపోవడానికి విద్యుత్ చార్జీల పెంపు ప్రధాన కారణమన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కరెంటు చార్జీలు పెంచం, వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడాన్ని ఉపసంహరంచుకుంటామని టీడీపీ కూటమి నాయకులు చెప్పారన్నారు. కానీ శ్వేతపత్రంలో ఈ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచుతారా లేక తగ్గిస్తారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

డయేరియా ప్రబలకుండా పటిష్ట చర్యలు

- ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందించాలి
- కలెక్టర్ శ్రీధర్ చామకూరి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 10: జిల్లాలో డయేరియా ప్రబలకుండా పటిష్టంగా నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సిహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో డయేరియా ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవలన్నారు. ప్రతి ఇంటికి ఆశా కార్యకర్తలు వెళ్లి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం, జింక్ మాత్రలు సరఫరా చేయడంతో పాటు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని, కలుషిత తాగునీటిని తాగొద్దని ప్రజలకు చెప్పాలన్నారు. అలాగే డయేరియా వస్తున్న ప్రాంతాలలో నీటి పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. గ్రామాల్లోకి వైద్య బృందం వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో తాను కూడా గ్రామాలలో పర్యటిస్తానని అక్కడ ఏమైనా ఆరోగ్య సమస్యలు నా దృష్టికి వస్తే చర్యలు చాలా సీరియస్‌గా తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో, డీఐవో, డీఎంవో, డీపీఎంవోలు తప్పనిసరిగా మండలాలలో పర్యటించాలన్నారు. ప్రగతి లక్ష్యసాధనలో వెనుకబడితే మెడికల్ ఆఫీసర్‌దే బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్‌వో కొండయ్య, మలేరియా అధికారులు, సూపర్‌వైజర్లు, డీపీఎంలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకం పటిష్టంగా అమలవ్వాలి..

జిల్లాలో మధ్యాహ్న భోజనం పథకం పటిష్టంగా అమలవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మధ్యాహ్న భోజనం అమలుపై విద్యాశాఖ, పౌర సరఫరాల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలవుతోంది, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఏమైనా అవకతవకలు జరిగితే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి, సివిల్‌సప్లయ్ అధికారులు రఘురాం, ఐసీడీఎస్ పీడీ శశికళ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పులివెందుల/పులివెందుల టౌన్, జూలై 10: క్రీడా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 2వ హాకీ ఇండియా జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ చాంపియన్ షిప్-2024 క్రీడాపోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు పొందారన్నారు. ఈ క్రీడా పోటీలు జిల్లాలోని క్రీడాభిమానులకు, స్థానికులకు వారం రోజుల పాటు కనువిందు చేయనున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో మున్ముందు ఇదే క్రీడా మైదానంలో మరిన్ని జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయన్నారు. జాతీయ క్రీడ హాకీకి కడప జిల్లాలో ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హాకీకి అత్యంత ప్రాచుర్యం కల్పిస్తూ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రావీణ్య కోచ్‌లను ఏర్పాటుచేసి అకాడమీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ అన్ని ప్రవేశాలు, ఉద్యోగాల కల్పనలో అవకాశాన్ని అందిస్తోందన్నారు. ఈ క్రీడాపోటీలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కాకుండా హాకీ అసోషియేషన్ తరపున నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.



హాకీ పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్రతో రూ.130కోట్లు నీళ్లపాలు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన ముగుస్తున్న సమయంలో కేవలం 44 రోజుల్లో ఆడుదాం ఆంధ్ర అనేపేరుతో రూ.130కోట్ల నిధులను నీళ్లపాలు చేసిందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. క్రీడా కిట్లను కొనడానికి రూ.44కోట్లు, టీషర్టులు, టోపీలను కొనేందుకు రూ.30వేలు, భోజనాలకు రూ.4కోట్లు.. ఇలా రూ.130కోట్లు 44రోజుల్లోనే ఖర్చుచేశారంటే ఏ మేరకు క్రీడలపై అభిమానం ఉందో అర్థం అవుతుందన్నారు. ఆ రూ.130కోట్లను క్రీడాకారులపై ఖర్చుపెట్టి ఉంటే బాగుండేదన్నారు. వైసీపీ హయాంలో కోచ్‌లకు 7నెలల బకాయిలు పెండింగ్ పెట్టిందని, టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డ 35 రోజుల్లోనే ముఖ్యమంత్రి చొరవతో జిల్లాలోని కోచ్‌లకు పెండింగ్ జీతాలు చెల్లించామన్నారు. క్రీడారంగంలో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసేవ్యవస్థను కూడా అరికడతామన్నారు. త్వరలో కమిటీ వేసి నకిలీ విధానాన్ని రూపుమాపుతామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను తయారుచేయడమే తమ ప్రాధాన్యత అన్నారు.

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి జిల్లాలో గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ఆణిముత్యాలను దేశ, ప్రపంచ స్థాయిలో మెరిసేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్రీడా రంగంపై అత్యంత శ్రద్ధ వహిస్తుండడం మన అదృష్టమన్నారు. భవిష్యత్తులో శాప్ సంస్థ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

అనంతరం మంత్రి క్రీడాజ్యోతి వెలిగించి హాకీ పోటీలను ప్రారంభించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర హాకీ అసోసియేషన్ నిరంజన్ రెడ్డి, ప్రెసిడెంట్ చాణిక్యరాజు, డీఎస్డీఓ జగన్నాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి జట్లు తలపడనున్నాయి.



ఆంధ్రప్రదేశ్ హాకీ క్రీడాకారుల పరేడ్



హాకీ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న మంత్రి

పేదల ఇళ్లకు గ్రహణం

- ఇళ్ల నిర్మాణంలో చేతులెత్తేసిన జగన్ సంస్థలు
- 212585 ఇళ్లకు 600 మాత్రమే పూర్తి
- పేదల ఆశలు.. అడియాశలేనా

జగనన్న కాలనీలో పూర్తికాని ఇళ్లు



కడప(కలెక్టరేట్), జూలై 10: గత జగన్ సర్కారులో పేదలకు ఇళ్లు కట్టించి, తాళం చేతికిస్తామని ఆశలు రేపారు. ఏకంగా ఇళ్లు కాదు.. ఊళ్లకు ఊళ్లు కట్టిస్తామని ఆర్భాట ప్రచారంతో ఊదర గొట్టారు. దాదాపు మూడున్నరేళ్ల పాటు ఇళ్ల నిర్మాణాలను సాగదీసి.. చివరకు ఎన్నికల సమయానికి 212585 ఇళ్లకు కేవలం 600 ఇళ్లు పూర్తి చేసి తమ వల్ల కాందంటూ చేతులెత్తేశారు.

జిల్లాలో నాలుగేళ్ల కిందట పేదల ఇళ్ల నిర్మా ణాలకు సెంటు స్థలం చొప్పున లక్షమందికి పైగా పంపిణీ చేశారు. 434 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. లే అవుట్లలో మౌలిక సదుపాయాలు, వాటర్ సప్లయ్, పబ్లిక్ హెల్త్ కింద ఆఘ మేఘాలతో పనులు చేపట్టారు. అయితే బిల్లులు చెల్లించడంలో మాత్రం చతికిల పడ్డారు. కేంద్రం ప్రతి లబ్ధిదారునికి ఇచ్చే నిధులు తప్ప, రాష్ట్రం నుంచి నయ్యాపైసా ఇవ్వకుండా ఇళ్లు నిర్మించుకోవాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి కావాలంటే రూ.5 నుంచి 6 లక్షలు వ్యయం కావడంతో పేదలకు తలకు మించిన భారమైంది. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు ఆపేశారు. ఇలాంటి సమయంలో జగన్ సర్కారు ఎత్తుగడ వేసి తన అనుకూలురైన పెద్ద పెద్ద కాంట్రాక్ట్ సంస్థలను రంగంలోకి దింపింది. ఆ సంస్థలు కూడా పేదలపై ఎనలేని మమకారం, దయా కరుణతో ముందుకొచ్చారు. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు ఎస్‌జీహెచ్ఎస్ నిధులు కలుపుకొని రూ.2.10 లక్షలతో ఇల్లు కట్టేందుకు సిద్ధమంటూ కాలనీలలో ఆప్షన్-3 కింద 212585 ఇళ్లు పూర్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

జగన్ సర్కార్ ఎన్ని ఎత్తులు వేసినా...

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలు ఆది నుంచి విమర్శల మధ్య సాగుతున్నాయి. 434 లే అవుట్లలో 67522 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఎన్నికల నాటికి కింద మీద పడి పేదలపై ఒత్తిళ్లు పెంచి ఇళ్లు కట్టిస్తే ఓట్లు గంపగుత్తగా పడతాయని భావించారు. అప్పటి జగన్ సర్కారు ఎన్ని ఎత్తులు వేసినా కేవలం 11500 ఇళ్లు పూర్తి చేయగలిగింది. లబ్ధిదారులు సొంత సలాల్లో దాదాపు 28989 మందికి ఇళ్లు మంజూరు కాగా... అందులో 20959 ఇళ్లు పూర్తి చేయడం గమనార్హం.

పెండింగ్ బిల్లులతో ఆగిన పేదల ఇళ్లు

జగన్ సర్కారు నవరత్నాలంటూ అట్టహాసంగా పేదలకు ఇళ్లు అనే పథకం తెచ్చింది. కానీ జిల్లాలో గుర్తించిన 434 లే అవుట్ల పరిధిలో వాటర్ సప్లయ్ పైపులను, రోడ్లు, మౌలిక సదుపాయాలకు సంబంధించి బిల్లులు చెల్లించని కారణంగా ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. ముఖ్యంగా కాలనీలు కట్టించేందుకు ముందుకు వచ్చిన సంస్థలు కూడా తూతూ మంత్రంగా ఇళ్ల నిర్మాణాలు చేయడమే కాకుండా ఆప్షన్-3 కింద లబ్ధిదారులకు వచ్చిన బిల్లులను ఇప్పటికే సొమ్ము చేసుకున్నాయి. బేస్ మట్టం స్థాయిలో కొన్ని, రూఫ్ లెవల్, స్లాబ్ లెవల్లో గృహాలను పూర్తి చేయకపోవడం వల్ల పెద్ద ఎత్తున సిమెంట్, ఐరన్ లాంటివి కూడా తమ సొంత ఆస్తుల్లాగా అమ్ముకున్నారనే విమర్శలున్నాయి ఇటీవల పులివెందుల గృహ నిర్మాణాల్లో అక్రమాలు వెలుగు చూడడంతో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య శనివారం తనిఖీలు చేసి కలెక్టర్‌కు నివేదికలు అందజేశారు. ఇక పోతే పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చిన సంస్థల్లో పులివెందులలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశరెడ్డికి చెంది న రాక్రేట్ సంస్థ, కడపలో నెల్లూరుకు చెందిన జేఎన్ ఆర్ కన్‌స్ట్రక్షన్, ప్రొద్దుటూరులో వినాయక సంస్థ, మైదుకూరు, బద్వేల్‌లలో మదన్ మోహన్ సంస్థలు పేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మించి ఇపుడు చేతులెత్తడంతో లబ్ధిదారులు ఇంటి కల కలగానే మిగలనుంది.

> **ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తాం**
>
> 
>
> జిల్లాలో లే అవుట్లలో వాటర్ సప్లై పైపు లైను, రోడ్డు పనులకు సం బంధించి కొన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు త్వరలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళిక ప్రకారం పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తాం.
>
> - కృష్ణయ్య, జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్

విద్యుత్ సమస్యలను వాట్సప్ ద్వారా తెలపండి : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ

కడప (నాగరాజుపేట), జూలై 10: ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురి కాకుండా వాలిపోయిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు వంటి విద్యుత్ సమస్యలను వాట్సప్‌ద్వారా తెలపాలని విద్యుత్‌శాఖ అధికారి రమణ అన్నారు. బుధవారం కడప విద్యుత్ వినియోగదారుల సేవా కేం ద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వాట్సాప్ ద్వారా తమ సమస్యలు పరిష్క రించుకోవడానికి వీలుగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుని పేరు, గ్రామం, మండలం, వారి మొబై ల్ నెంబరుతో వాట్సప్ నెం:9440814264కు పంపితే హెల్ప్ డెస్క్ సిబ్బంది సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అనుసరిస్తారన్నారు. సమస్య తీవ్రత బట్టి విద్యుత్ సమస్యలను సకా లంలో పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారుడికి సకాలంలో సేవలు అందించ డమే సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

సికెదిన్నె, జూలై 10: పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రెండు రోజుల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ద్వారా యువత ఉపాధి అవకాశాలు పెంచుకోవడంతోపాటు మంచి పౌష్టికాహారాన్ని సమాజానికి అందించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని, అందుకు యువత ఉపాధి రంగాల్లో ముందుండాలన్నారు. శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో ఉండే వివిధ రకాలను వివరించి.. వాతావరణానికి అనుకూలమైన వాటిని పెంచుకోవాలన్నారు. పుట్టగొడుగుల్లో మంచి పోషకాహారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, మానస, రైతులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో

సిద్దవటం, జూలై 10: మండలంలోని బాకరాపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం డీఈవో అనురాధ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు చదువులో కొందరు వెనుకబడి ఉన్నారని, వారికి కూడా నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 అరుణ, హెచ్ఎం లక్ష్మీకేశమ్మ, సీఆర్‌పీ హైమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సొంత బావే హతమార్చాడు...

- స్నేహితుడుతో కలిసి బావమరిదిని హత్య చేసిన వైనం
- పోలీసుల విచారణలో వెల్లడి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, జూలై 10: స్థానిక రెడ్డీస్‌కాలనీలోని సిద్దిక్ మసీద్ డౌన్ వీధిలో షేక్.రెడ్డిబాష కుమారుడు అబ్దుల్‌రహీంను సొంత బావ హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య కేసులను నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ ఇన్‌చార్జి సీఐ చంద్రశేఖర్ బుధవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. అబ్దుల్‌రహీం గత కొంత కాలంగా రాయచోటి పట్టణంలోని రాణా సమీపంలోని మదరసా ఎదురుగా గల సందులో ఉన్న కేజియన్ చికెన్ సెంటర్‌లో కూలి పనిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో సొల్యూషన్ పీల్చడం, మద్యం తాగడం వంటి చెడు అలవాట్లకు బానిసై.. గత కొంత కాలంగా తన తల్లిని, సొంత అక్కను వేధిస్తూ డబ్బులు ఇవ్వమని నానా రకాలుగా ఇబ్బంది పెట్టేవాడు. దీంతో అతని వేధింపులు తట్టుకోలేక అబ్దుల్ రహీం సొంత పెద్ద అక్క భర్త అయిన షేక్. ఇర్షాద్‌అలీ అలియాస్ సూరా దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అతను చాలా సార్లు అబ్దుల్‌రహీంను మందలించాడు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో ఇర్షాద్‌అలీ చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 6వ తేదీ రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో ఇర్షాద్‌అలీ తన చిన్ననాటి స్నేహితుడైన చెన్నముక్కపల్లె గ్రామం రాజులకాలనీ శ్యామలవారిపల్లెకు చెందిన సాయికుమార్‌కు విషయం చెప్పాడు. అతనితో కలిసి అబ్దుల్‌రహీం ఇంటికెళ్లి తమ వెంట తీసుకువచ్చి గున్నికుంట్ల రోడ్డులోని సమాధుల వద్ద చాకుతో గొంతుకోసి హత్య చేశారు. శవాన్ని అక్కడే కంపచెట్లలో పడేసి నిందితులు పరారయ్యారు. అబ్దుల్ రహీం తండ్రి రెడ్డిబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ పోలీసులు సీఐ చంద్రశేఖర్,ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో బుధవారం నిందితులను రాయచోటి పట్టణ పరిధిలోని వీరబల్లి రింగు రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్య చేసేందుకు ఉపయోగించిన చాకుతో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రాయచోటి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలియజేశారు.

ట్రావెల్ ఏజన్సీలో చోరీ.. రూ.లక్ష అపహరణ



దొంగలు పగలగొట్టిన ట్రావెల్ ఏజన్సీ పైకప్పు, క్యాష్ టేబుల్

కడప (క్రైం), జూలై 10: కడప నగరం కృష్ణసర్కిల్ సమీపంలోని మౌలానా ట్రావెల్స్ ఏజన్సీలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు రూము పైకప్పు పగలగొట్టి లోపలికి ప్రవేశించి నగదు అపహరించారు. ట్రావెల్ నిర్వాహకుడు మౌలానా బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మంగళవారం రాత్రి 9.30 గంటలకు ట్రావెల్ ఏజన్సీ మూసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఆ రూము పైన ఉన్న రేకులను పగలగొట్టి రూములోకి వెళ్లి.. క్యాష్ టేబుల్ పగల గొట్టి అందులో ఉన్న లక్ష నగదును అపహరించారు. కొంత మంది గల్ఫ్ వెళ్లేందుకు టికెట్ కోసమని నగదును మంగళవారం ఇచ్చారని.. ఆ నగదును టేబుల్ లాకర్‌లో పెట్టి తాళం వేసుకుని వెళ్లామని.. దొంగలు టేబుల్‌లో ఉన్న లక్ష రూపాయల అపహరించినట్లు బాధితులు పేర్కొన్నారు. పక్కనే ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర ప్లేవుడ్ షాపులో చోరీకి యత్నించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ ఘటన పరిశీలించి కేసు నమోదు చేశారు.

పోలీసు స్టేషన్‌లో మాజీ కౌన్సిలర్ హల్‌చల్

- మీసాలు దువ్వి.. తొడలు కొట్టి.. నేనెవరో తెలియదా..
- మిమ్మల్ని బదిలీ చేయకుంటే నాపేరు మార్చుకుంటా..

ప్రొద్దుటూరు, జూలై 10: అధికార పార్టీలో వార్డు స్థాయి నాయకుడినైన నన్ను పోలీసులు గుర్తించరా... పోలీసు స్టేషనుకు వస్తే గౌరవ మర్యాదలు పాటించరా.. అందరితో పాటు మమ్ములను చూస్తారా.. అంటూ మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు చింతకుంట జయలింగారెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో హల్‌చల్ చేశాడు. మాజీ కౌన్సిలర్ జయ లింగారెడ్డి ఇటీవలే ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వైసీపీ నుంచి తన భార్య 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితతో పాటు వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాడు. ఆయన బుధవారం మధ్యాహ్నం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఓ పంచాయితీ విషయమై పెద్దమనిషిగా స్టేషనుకు వెళ్లాడు. స్టేషన్‌లో వుండే హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ తనను అధికారపార్టీ వార్డు స్థాయి నాయకుడిగా కూడా గుర్తించకుండా.. మర్యాద పాటించలేదని.. అందరితో సమానంగా ట్రీట్ చేశారని.. తనకు ఇది అవమానమని ఆవేశంతో ఊగిపోయారు. మీకు నేనెవరో తెలిసేలా చేస్తా.. మిమ్మల్ని స్టేషన్ నుంచి బదిలీ చేయించకుంటే.. నాపేరు మార్చుకుంటా.. అంటూ మీసాలు దువ్వి తొడలు కొట్టి సవాల్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మీపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్స్‌ను బెదిరించినట్లు వారు ఆరోపించారు.

ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మధ్యాహ్నం ఒక పంచాయితీ విషయమై పెద్దమనిషిగా చింతకుంట జయలింగారెడ్డి వచ్చాడని.. అతన్ని పోలీసులు అధికార పార్టీ నాయకుడుగా గుర్తించి గౌరవించలేదని పోలీసులపై దుబారాగా మాట్లాడినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎస్ఐ గానీ, నేను గానీ లేనని.. కానీ జరిగిన విషయంపై విచారించానని... ఆయన మద్యం సేవించి వున్నాడని.. నిజంగానే కానిస్టేబుల్స్‌కు అతను ఎవరో తెలియదన్నారు. కానీ పోలీసులను దుబారాగా మాట్లాడటం సరికాదని అధికారపార్టీ అయిన సామాన్యులైన అందరితో ఒకేలా నడుచుకుంటామని తెలిపారు.

చెత్త సేకరణ కేంద్రాల్లోనే డంపింగ్ చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి



చెత్త సేకరణ కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు ఇస్తున్న డీపీవో

పెనగలూరు, జూలై 10: గ్రీన్ అంబాసిడర్‌లు గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రభుత్వం నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాల్లోనే వేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి సూచించారు. బుధవారం కంబాలకుంట సమీపంలో నిర్మించిన పెనగలూరు చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం చెత్త సేకరించాలని, తడిచెత్త, పొడి చెత్తలను వేర్వేరు చేసి డంపింగ్‌యార్డుల్లో సూచించిన తొట్లల్లో డంపింగ్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె డంపింగ్‌యార్డుల్లో నిర్మించిన వివిధ రకాల తొట్లను పరిశీలించారు. అలాగే ఏ తొట్టిలో తడిచెత్త వేయాలి, పొడి చెత్త వేయాలి, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏ తొట్టిలో వేయాలనే విషయాలపై క్షుణ్ణంగా వివరించి.. ఆవిధంగా గ్రీన్ అంబాసిడర్లను అనుసరించాలని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లను ఈ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు గ్రామ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించి నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో పార్వతి పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే నాబార్డు లక్ష్యం : డీడీఎం




మామిడి చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సుండుపల్లె, జూలై 10: గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి నాబార్డు సేవలు ఎంతో దోహదపడుతున్నాయని నాబార్డు డీడీయం విజయవిహారి తెలిపారు. నాబార్డు ఆర్థిక సహాయంతో గిరిజన రైతులు సాగు చేసిన మామిడి తోటలను ఆయన బుధవారం తనిఖీ చేసి.. తోటల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మండలంలోని మడితాడు, సుండుపల్లె గ్రామ పంచాయతీల్లో 500 మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక ఎకరా చొప్పున 500 ఎకరాలు మా తోట కార్యక్రమంలో భాగంగా సాగు చేయడం జరుగుతుందన్నారు. గుంతలు తీసేటప్పటి నుంచి చెట్లు నాటే వరకు వాటి సంరక్షణ రైతులు చూసుకునే విధంగా నాబార్డు సేవలు రైతులు పొందుతున్నారన్నారు. అలాగే రైతులకు ఎరువులు, పైపులు, నీటి వసతి లేని రైతులకు బోర్లు వేయిస్తున్నామని తెలిపారు. అలాగే రైతుల నాటిన జామ ఇతర పండ్ల తోటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీయంఎస్ ప్రధాన కార్యదర్శి రత్నం, ఎండీ జావీద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువపై ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

- సర్వేచేసిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- రేపో మాపో చర్యలు చేపట్టనున్న అధికారులు



ఆక్రమణకు గురైన కాలువ మ్యాప్

ప్రొద్దుటూరు, జూలై 10: ప్రొద్దుటూరు మునిసిపాలిటీలోని కాలువపై అక్రమంగా నిర్మించిన కట్టడాలపై ఆంధ్రజ్యోతిలో జూన్ 30న 'ఆక్రమించి అడ్డగోలు నిర్మాణాలు' కథనం వచ్చింది. ఈకథనంపై మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టౌన్ ప్లానింగ్ అధికారులను, మున్సిపల్ సర్వేయర్‌ను కాలువ ఆక్రమణలపై సర్వే చేయాలని ఆదేశించారు. ఆమేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ టౌన్ సర్వేయర్ కాలువ ఆక్రమణలపై సర్వే చేశారు. ఎక్కెడెక్కడ ఎంత మేరకు అక్రమ కట్టడాలు నిర్మాంచారో మ్యాప్ తయారీ చేశారు. లీగల్‌గా ఎలాంటి సమస్యలు రాకుండా కాలువపై ఆక్రమణలను, మున్సిపల్ స్థలంలోని కట్టడాన్ని తొలగించేందుకు రంగం సిద్ధమైంది. రేపో మాపో కాలువపై ఆక్రమ నిర్మాణాలను తొలగించే చర్యలు తీసుకోనున్నారు.

వెబ్‌ల్యాండ్‌లో భూమి తారుమారు

డిప్యూటీ తహసీల్దార్, రిటైర్డ్ తహసీల్దార్‌లపై కేసు

కొండాపురం, జూలై 10: ఒక వ్యక్తికి చెందిన భూమిని తన ప్రమేయం లేకుండా రికార్డులు తారుమారు చేసి మరొకరికి మార్చినందుకు డిప్యూటీ తహసీల్దార్, రిటైర్డ్ తహసీల్దార్‌లపై తాళ్లప్రొద్దుటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కె.సుగుమంచి పల్లెలో పెద్దరంగారెడ్డి గారి చిన్నారెడ్డి అనే వ్యక్తికి సంబంధించి ప్రధాన రహదారికి ఆనుకొని 133/4 సర్వే నెంబ రులో ఉన్న 33 సెంట్ల భూమిని మరొకరి పేరు మీదకు వెబ్ ల్యాండ్ ద్వారా తారుమారు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు ఏడేళ్ల కిందట కొండాపురం తహసీల్దార్‌గా పనిచేసి.. రిటైర్డ్ అయిన ప్రభాక ర్‌రెడ్డి, ప్రస్తుత కొండాపురం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేశ్వ రమ్మతో పాటు మరో ఆరుగురి ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు. ఈ భూమి పుల్లయ్య అనే వ్యక్తితో తమ బంధువులు కొన్నారని, ప్రస్తుతం దీనికి సంబంధించిన కేసు లోకాయుక్తాలో నడుస్తోందని.. తన ప్రమేయం లేదని డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ వివరణ ఇచ్చారు.

హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరాలి


- అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కడప(రూరల్) జూలై 10: ద్విచక్రవాహనాలను నడిపే సమయంలో హెల్మెట్‌ను తప్పక ధరించాలని ఇన్‌చార్జ్ డీఎల్ఎస్ఏ సెక్రటరీ, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులు, న్యాయవాద క్లర్కులకు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలని, రోడ్డు భద్రత నియమావళిని పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద క్లర్కులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల తనిఖీ



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 10: వైవీయూ అనుబంధ కళాశాలల్లో జరుగుతున్న పీజీ సెమిస్టరు పరీక్షలను వైవీయూ రిజిస్ట్రారు ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న కేంద్రానికి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేశారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడారు. అలాగే విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు.

ఆయిల్‌ఫాం సాగుపై మక్కువ చూపాలి

పెనగలూరు, జూలై 10: మండలంలోని వ్యవసాయ ఫలాలు ఆయిల్‌సాగుకు అనుకూలమైనవని రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌ఫాం సాగు చేసుకోవాలని రాజంపేట ఉద్యానవనశాఖ అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. బుధవారం కట్టావారిపల్లె, ఈటమాపురం, సింగారెడ్డిపల్లె గ్రామాల్లో జరిగిన రైతుల సమావేశంలో ఆయన ప్రజలకు ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏడాదికి రూ.5150 వంతున నాలుగేళ్లకు రూ.21 వేల ఆర్థికసాయం, అంతర పంటల సాగు కోసం మరో రూ.20 వేల ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. ఇవి రెండు పూర్తిగా రైతులకు ఉచితంగా ఇవ్వనున్నామని, అవకాశాలను మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఎస్ ఆగ్రో ఇండస్ట్రీ మేనేజర్ కొండారెడ్డి, వీహెచ్‌ఏ షమివలీ, వీఏఏ సునీల్‌కుమార్, సింగారెడ్డిపల్లె గ్రామ సర్పంచ్ పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని రవాణాపై చర్యలు

● తహసీల్దార్ జరీనాబేగం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నుండుపల్లె, జూలై 10: ఇసుక, మట్టి అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జరీనాబేగం తెలిపారు. మట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, ఇసుక, మట్టి తరలించేందుకు ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు తీసుకొని అవసరాల నిమిత్తం తోలుకోవాలని కోరారు. బుధవారం మండల కేంద్రంలో మట్టి తోలుతున్నట్లు స్థానికులు, ప్రజా సంఘాల నుంచి సమాచారం అందడంతో అక్కడికి రెవెన్యూ సిబ్బందిని పంపించినట్లు తెలిపారు. అలాగే బాహుదానది నుంచి ఎవరైనా ఇసుకను తరలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రతి విద్యార్థిలో నైపుణ్యాన్ని పెంపొందించాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 10: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిలో నైపుణ్యాన్ని పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారులు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. బుధవారం అనంతపురం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను వారు పరిశీలించి మాట్లాడుతూ మండలంలో అనంతపురం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను బెస్టు పాఠశాలగా గుర్తించామని, పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యాప్రమానాలు మెరుగుగా ఉన్నాయన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు శోభారాణి విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందుతుండడంతో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామాంజనేయులు, అకౌంటెంట్ ఫక్ర్‌ద్దీన్, సీఆర్‌పీ చంద్రకళ, సుహాసిని, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమ పథకాల అమలు

● రాజంపేట టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, జూలై 10: టీడీపీ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని రాజంపేట టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య పేర్కొన్నారు. భాకరాపేట బస్టాండ్ వద్ద బుధవారం టీడీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సరిగ్గా నెలరోజులు పాలన గడవకముందే నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం (డీఎస్సీ నోటిఫికేషన్), వృద్ధులకు, వికలాంగులకు, ఇతర అర్హులైనవారికి పెన్షన్లను పంపిణీ చేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. కార్మిక వర్గాలకు చేతినిండా పని దొరికేలా, అలాగే పేద ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం తగ్గించకుంటే ఉద్యమం తప్పదు : సీపీఎం

రాయచోటిటౌన్, జూలై 10: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రజలపై భారాలు మాత్రం తప్పేలా లేవని అదే జరిగితే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'తాము అధికారంలోకి వస్తే ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించుకుంటామని' సీఎం చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ప్రజలకు హామీనిచ్చారని, అయితే మంగళవారం సచివాలయంలో జరిగిన విద్యుత్ శ్వేతపత్రం కార్యక్రమంలో భారాలు మోపే దిశగానే తీరు ఉన్నదన్నారు. ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపితే ప్రజల పక్షాన ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రామాపురం, జూలై 10: మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఉన్న వంకలో అక్రమంగా ఎలాంటి పర్మిట్లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను బుధవారం రామాపురం పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన లబ్ధిదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకొని సంబంధిత అధికారులు సంప్రదించి ఇసుకను తీసుకోవచ్చన్నారు. అక్రమంగా ఎవరైనా ఇసుక రవాణా చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్వాడీల ధర్నా

రాయచోటిటౌన్, జూలై 10: అంగన్వాడీ ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద రాయచోటి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు బంగారుపాప, ఖాజాబీ, విజయ, నాగమణి, పద్మజ, శంకరమ్మ, కవిత, ఉమా, జలజ, శ్రీదేవి, జయ, రెడ్డెమ్మ, కళ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇసుక సమస్యను పరిష్కరించండి

● కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి


కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయిలోకేష్ తదితరులు

రాజంపేట, జూలై 10: జిల్లాలో ఇసుక సమస్యను త్వరితగతిన పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాయచోటి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత భవన నిర్మాణ రంగం రెండవ అతి పెద్ద రంగమన్నారు. వైసీపీ అడ్డగోలు విధానాల వల్ల సామాన్యులకు ఇసుక అందక గత ఐదేళ్లలో నిర్మాణ రంగం అతలాకుతలమై భవన నిర్మాణ కార్మికులు, ఇతర సిబ్బంది రోడ్డుపాలయ్యారన్నారు. నూతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వీరికి శుభపరిణామమన్నారు. వెంటనే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి రైల్వేకోడూరులోని మంగంపేట, మందరం, రాజంపేట తదితర అనేక ప్రాంతాల్లో ఇసుక పాయింట్‌లను ఏర్పాటు చేసి అందరికీ ఉచిత సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిట్వేలి నాయకులు సుబ్బరాయుడు, డాక్టర్ శ్రీనివాసరాజు, నిర్మల్‌కుమార్, హరిబాబు, శ్రీనివాసరెడ్డి, క్రిష్ణయాదవ్, షబ్బీర్‌అహ్మద్, కృష్ణయ్య, కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

● రాజంపేట టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాజంపేట, జూలై 10: ఆకేపాటికి ప్రొటోకాల్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని రాజంపేట టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు పేర్కొన్నారు. బుధవారం రాజంపేట టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మండల టీడీపీ నాయకుడు మేకా నరసింహులు, దొంతం శివప్రసాద్, ఓబిలి మల్లికార్జునరెడ్డి, కొల్లా వెంకటసుబ్బయ్య, కోనంకి మల్లికార్జున, మిట్టమీదపల్లె ఎంపీటీసీ గొంటు సురేష్, కొల్లావారిపల్లె సర్పంచ్ మహేష్, వెంకటరమణరాజులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రొటోకాల్ పాటించలేదని జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు చెందిన వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలేదా అని నిలదీశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసింది భూకబ్జాలు, ఇసుక దోపిడీ, ఇతర అవినీతి కార్యక్రమాలేనని విమర్శించారు. ఆక్రమించిన భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పకపోతే తామే వాటిని స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు పంచిపెడతామన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : సీఐటీయూ


మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 10: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ డిమాండ్స్ డేలో భాగంగా కార్మికులు రాయచోటి మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టి బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు చెన్నయ్య, శంకరయ్య, కోశాధికారి రాంబాబు, ప్రకృతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుకర్, విద్యుత్ రంగం నాయకులు గౌడ్, గంగాధర్, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, విజయమ్మ, అరుణ, నాగమణి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలపై సిబ్బందికి శిక్షణ

● జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్

రాయచోటిటౌన్, జూలై 10: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్యులు, స్టాఫ్ నర్సులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం) జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించాలని, లేకపోతే పిల్లలు జీవితాంతం వైకల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చిన్నతనంలో వచ్చే వినికిడి లోపంతో పిల్లలు మూగవారిగా ఉండిపోతారని, ఇలాంటి వారికి సకాలంలో వైద్య సేవలందిస్తే మాట్లాడగలరన్నారు. కంటిశుక్లాలు, చిన్నతనంలోనే వచ్చే పక్షవాతం తదితర సమస్యలు నయం చేసే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో డీఈఐసీ (జిల్లా సత్వర బాల చికిత్స కేంద్రం) మదనపల్లెలో ఉందని, వైద్యులు, స్టాఫ్ నర్సులు ఇక్కడ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వారు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఓపీ ద్వారా 104 సేవల్లో ఈ నాలుగు రకాల లోపాలు గల శిశువులు, పిల్లలను గుర్తించి సత్వర చికిత్సకు డీఐసీకి రెఫర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సురేశ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యవిధాన పరిషత్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలపై నిరసన

రైల్వేకోడూరు(రూరల్), జూలై 10: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేసి కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా నాయకులు, ఏపీఎండీసీ పోరాట సమితి కన్వీనర్ రేకులకుంట వెంకటేష్, సీఐటీయూ మండల అధ్యక్షుడు సి.పుల్లయ్య, ఉపాధ్యక్షుడు యానాదయ్య, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌తో ఇడమడకల కుమార్ భేటీ

రాజంపేట, జూలై 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తో రాజంపేట టీడీపీ బీసీ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి ఇడమడకల కుమార్ భేటీ అయ్యారు. తాను పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కృషి చేస్తున్నానని లోకేష్ దృష్టికి తెచ్చారు. తనకు సముచితం స్థానం కల్పించాలని అభ్యర్థించారు. అనంతరం రాజంపేటలో పార్టీ స్థితిగతుల గురించి వివరించారు.

అవినీతిపై సీఐడీ విచారణ చేపట్టండి

● మంత్రికి విన్నవించిన హాకీ అకాడమీ సభ్యులు

రాయచోటిటౌన్, జూలై 10: హాకీ క్రీడాకారులకు జరిగిన అన్యాయం, అవినీతిపై సీఐడీచే విచారణ చేపట్టి క్రీడాకారులకు న్యాయం చేయాలని హాకీ అకాడమీ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు, ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ సుభాన్‌బాషాలు బుధవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాకీ ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో కేసులు ఆర్గ్యుమెంట్స్ జరుగుతుండగా స్పోర్ట్స్ అథారిటీ హాకీ ఆంధ్రప్రదేశ్‌కు హాకీ ఇండియా గుర్తింపు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అప్పటి 13 జిల్లాలు, ఇప్పటి 26 జిల్లాలు విచారిస్తే నిజమైన క్రీడాకారులు ఎవరో తెలుస్తుందన్నారు. క్రీడాకారులకు జరిగిన అన్యాయంపై విచారణ చేపట్టి ఏపీకి పూర్వ వైభవం తేవాలని వారు మంత్రిని కోరారు. అలాగే ప్రభుత్వం తరపున రాయచోటిలో హాకీ టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయించాలని విన్నవించారు.

సంబేపల్లె: మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం సంబేపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి బొకే, శాలువాతో సన్మానం చేశారు. రాయచోటి నుంచి సంబేపల్లె పాఠశాల వరకు వచ్చే ఆర్టీసీ బస్సును రౌతుకుంట వరకు పొడిగించాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి వెంటనే స్పందించి డీఎంతో మాట్లాడి వెంటనే బస్సు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, పదవ, ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీఎన్ఎస్ఎఫ్ నేతల వినతి

రాజంపేటటౌన్, జూలై 10: రాష్ట్రంలో బీసీ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ వినతిపత్రం అందజేశారు. బీసీ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కూడా లేవని వాపోయారు. గత జగన్ ప్రభుత్వంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు ఏమాత్రం పరిష్కరించలేదని, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను మంత్రి సానుకూలంగా విని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని

రైల్వేకోడూరు(రూరల్), జూలై 10: విద్యార్థులపై నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై కఠిన చర్యలు తప్పవని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళిక రూపొందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, భోజనంలో పౌష్టికాహారం వంటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని స్థానిక అధికారులకు సూచించారు. అనంతరం వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో ముచ్చటించి హాస్టల్‌లో ఉన్న మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి'

రాయచోటిటౌన్, జూలై 10: రాయచోటి మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని టీడీపీ యువనాయకుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

ప్రయాణికులకు బెంచీలు ఏర్పాటు

రాజంపేటటౌన్, జూలై 10: రాజంపేట పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేటు బ్యాంకు సమీపంలో ఈ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మరికొన్ని బెంచ్‌లను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ ప్రతినిధి షేక్ అబ్దుల్లా తెలిపారు.

మంత్రి చొరవతో ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ


ఆర్టీసీ బస్సులకు హారతి పడుతున్న వండాడి గ్రామస్తులు

చిన్నమండెం, జూలై 10: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి చొరవతో 10 సంవత్సరాల కిందట ఆగిన ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వండాడి మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి గ్రామస్తులతో కలిసి రాయచోటి నుంచి వండాడి, చాకిబండ, దిగువగొట్టివీడు మీదుగా గాలివీడుకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కొన్నిరోజుల కిందట అభ్యర్థించడంతో మంత్రి చొరవ తీసుకొని ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం నుంచి ప్రారంభించారు. మూడు షిఫ్టులతో రాయచోటి-వండాడి మీదుగా చాకిబండ, దిగువగొట్టివీడు, గాలివీడు వరకు ప్రారంభించారు. దాదాపు పదేళ్ల తర్వాత తిరిగి ప్రారంభం కావడంతో ఊరూరా బస్సులకు హారతులు, కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. అనంతరం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి: డీపీఓ


పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

చిట్వేలి, జూలై 10: సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ తెలిపారు. చిట్వేలి పంచాయతి కార్యాలయాన్ని ఆమె బుధవారం పరిశీలించి పన్నుల వసూళ్లపై పలు సూచనలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం విషయంలో తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చిట్వేలి ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డిని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, ఈవోపీఆర్డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నరసింహ, శివకుమార్, వెంకటేశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ


ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ముక్కా వరలక్ష్మీ, కూటమి నేతలు

చిట్వేలి, జూలై 10: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం చిట్వేలి ఆర్టీసీ బస్టాండ్‌ను కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈమె వెంట సీనియర్ నాయకులు రామాంజనేయులు, లారీ సుబ్బరాయుడు, మద్దిన చంద్రమోహన్‌నాయుడు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

లక్కిరెడ్డిపల్లె, జూలై 10: అంగన్ వాడీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో జాతీయ అంగన్ వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా సీడీపీఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి ఓబులమ్మ, నాగరాణి, నాగేశ్వరమ్మ, రుక్మిణి, మల్లేశ్వరి, వంకరమ్మ, బీవీ రమణమ్మ, శైలజ, చిన్న రెడ్డెమ్మ, సులోచనమ్మ, తదితరులు పాల్గొన్నారు.


కొలువుదీరిన గంధం పీరు


గంధం పీరుకు ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 10: మండల కేంద్రంలోని మఖాన్ వద్ద బుధవారం సాయంత్రం గంధపు పీరు, బుర్ర ఇమాన్‌పీరు కొలువుదీరాయి. దాదాపు 7 రోజులు పాటు మొహరం అంగరంగ వైభవంగా సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున మత పెద్దలు, ముస్లింలు హాజరవుతారని తెలిపారు. 12వ తేదీ అగ్నిగుండాలు తవ్వకం, 13న గంధం, 14న సంతానం లేని వారు ముడుపులు కట్టడం, 15న హుసేని అల్లా పేరు గంధం, 16న గంధం పీరు మెరమణి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మంత్రిని విమర్శించడం హాస్యాస్పదం

● విలేకర్లతో మండల టీడీపీ నేతలు


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సంబేపల్లె, జూలై 10: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురించి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మండల టీడీపీ నాయకులు నాగేశ్వర్‌నాయుడు, కోటిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం సంబేపల్లెలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధి పక్కన పెట్టి దోచుకోవడం, దాచుకోవడం తప్ప నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి అందులో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని చూస్తుంటే దానిపై వైసీపీ నేతలు బురదజల్లడం దారుణ మన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజుయాదవ్, చిన్నప్ప, మట్టి వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియా నుంచి ఏపీని కాపాడాలి

● ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్

రాయచోటిటౌన్, జూలై 10: రాష్ట్ర వ్యాప్తంగా విచ్చలవిడిగా సాగుతున్న డ్రగ్స్ మాఫియాను అరికట్టి ఏపీని కాపాడాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయచోటి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

సీఎంతో హేమాంబరధరరావు భేటీ



చంద్రగిరి, జూలై 10: చంద్రగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ పని చేశానని, నామినేటెడ్ పదవుల కేటాయింపులో తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు విన్నవించారు. బుధవారం విజయవాడలో చంద్రబాబును హేమాంబరధరరావు కలిశారు.ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ కోసం తన కృషిని వివరించారు.దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని హేమాంబరధరరావు తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు నాలుగు ఫిర్యాదులు



చిత్తూరు రూరల్, జూలై 10: గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహిం చిన విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డేకు నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 3 అప్పటికప్పుడే పరిష్కరించారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్‌డేపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. చాలా మందికి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలియడం లేదని, ఏఈలు, లైన్‌మెన్లు, శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. అన్ని రకాల విద్యుత్ సమస్యలపై వినియోగదారులు, రైతులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వాటిలో 90 శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. డీఈలు పాల్గొన్నారు.

అదుపుతప్పి రోడ్డు పక్కకు దిగబడిన పాఠశాల బస్సు

● విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



నక్కనపల్లె వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కకు దిగబడిన పాఠశాల బస్సు

వి.కోట, జూలై 10: వి.కోట మండలం కె.నక్కనపల్లె వద్ద ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దిగబడింది. విద్యార్థులందరూ క్షేమంగా బయట పడటంతో పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం విద్యార్థులతో వి.కోట నుంచి బయలుదేరిన బస్సు పట్రపల్లె మీదుగా జవ్వునిపల్లెకు వెళుతోంది. కె.నక్కనపల్లె సమీపంలో ముందు వెళుతున్న మరో పాఠశాల బస్సును అధిగమించే క్రమంలో ఎదురుగా ఆటో రావడం గమనించిన డ్రైవర్ బస్సును తిరిగి ఎడమవైపు తిప్పారు. ఈ క్రమంలో ముందున్న బస్సుకు వెనక కుడివైపు బస్సు ఢీకొని రోడ్డు పక్కన ఒరిగింది. బస్సును ఒక్కసారిగా అటు, ఇటు మళ్లించడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రోడ్డు పక్కనున్న పెద్దరాయికి వెనుక టైర్లు అడ్డురావడంతో బస్సు పక్కనున్న పొలాల్లోకి బోల్తాపడకుండా ఆగింది. లేకుంటే బస్సు బోల్తాపడి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగేది. ఈ సమయంలో బస్సులో ముప్పై మందికిపైగా చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని పిల్లలను బస్సులోంచి దించి ద్విచక్ర వాహనాల ద్వారా వారి ఇళ్లకు చేర్చారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని అతనిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎద్దుపొడిచి రైతు మృతి



జయచంద్ర (ఫైల్ ఫొటో)

భైరెడ్డిపల్లె, జూలై 10 : ప్రమాదవశాత్తు ఎద్దుపొడిచి ఓ రైతు మృతిచెందిన ఘటన బుధవారం భైరెడ్డిపల్లెలో జరిగింది. భైరెడ్డిపల్లె మహమ్మదీయవీధిలో నివాసం వుంటున్న జయచంద్ర(37) తమ ఎద్దును గ్రామసమీపంలో పొలాల వద్దకు మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎద్దు పొడవడంతో జయచంద్ర స్పృహ కోల్పోయారు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆలస్యంగా నడుస్తున్నరైళ్లు

తిరుపతి(సెంట్రల్)జూలై10: తిరుపతి,రేణిగుంట స్టేషన్ల మీదుగా బుధవారం పలు రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. కేరళ ఎక్స్‌ప్రెస్ (12626-12625) రెండు గంటలకు పైగా ఆలస్యంగా నడుస్తోంది. కన్యాకుమారి నుంచి ముంబాయికి వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్(16382) రెండున్నర గంటలు, ముంబాయి- చెన్నై ఎక్స్‌ప్రెస్(22159)లు గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నాయి. హౌరా- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22887) ఐదున్నర గంటలు, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్(12770)గంటన్నర పాటు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తాగునీటికి,అల్పాహారాలకోసం ఇబ్బంది పడ్డారు.

తిరుపతి-హిస్సార్ ప్రత్యేక రైలు వేళల్లో మార్పు

తిరుపతి-హిస్సార్ (రాజస్తాన్) మధ్య నడుస్తున్న వారాంతరపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(04717-18) వేళల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇక నుంచి హిస్సార్ నుంచి రైలు బయలుదేరి సోమవారం ఉదయం 9.55 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరిగి అదేరోజు రాత్రి 11.45 గంటలకు తిరుపతిలో బయలుదేరనుంది. జైపూర్ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారుల కోరారు.

'కడా'కు సర్వాధికారాలు

● పుష్కలంగా ఆర్థిక వనరులు
● డివిజనల్ స్థాయి అధికారులపై అజమాయిషీ



కుప్పం పట్టణం

కుప్పం, జూలై 10: కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)కు సర్వాధికారాలు దఖలు పడ్డాయి. కుప్పం ప్రాంత అభివృద్ధి ఏకైక లక్ష్యంగా నడిచే ఈ సంస్థ పరిధిలోకే డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ విభాగాలను చేర్చడమే కాకుండా ఆయా గెజిటెడ్ అధికారులను, డివిజనల్ స్థాయి అధికారులను నేరుగా కడా పీడీకి బాధ్యులను చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి జీవో నెంబర్ 58 విడుదల చేసింది. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నెల్లూరు జిల్లా మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి అయిన వికాస్ మర్మత్ నియమితులైన విషయం తెలిసిందే. అదేరోజు కడాను ఏర్పాటు చేస్తూ, విధులు బాధ్యతలు కూడా నిర్వచిస్తూ జీవో 58ను ప్రభుత్వం విడుదల చేసింది. కీలకమైన అధికారాలు దాఖలు పడిన కడాకు ప్రత్యేకంగా ఆర్థిక శాఖనుంచి ప్రతి ఏటా నిధులు విడుదల చేయాలని కూడా ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాక ప్రత్యేక ఉద్యోగులను సైతం కేటాయించారు. గతంలో కడా ఉన్నదే కానీ, దానికి ఎటువంటి పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన అధికారాలు దాఖలు పడలేదని ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఆ లోటును భర్తీ చేస్తూ సకలాధికారాలతో కూడిన నూతన కడాను తీసుకొస్తూ జీవోను విడుదల చేసింది. ఎటువవంటి అధికారాలు లేని కడా ఎస్.ఓ. (స్పెషల్ ఆఫీసర్) పోస్టు పేరును పి.డి. (ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా) మార్చింది. గతంకంటే భిన్నంగా ఏర్పాటైన కడా విధులు, బాధ్యతలు ఇవీ.

- కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు కుప్పం మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కోసం కడా ఏర్పాటైంది.
- అన్ని ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం మెరుగు కావడానికి సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ సిస్టం ఏర్పాటు చేయడానికి కడా నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించారు.
- పూర్వం స్పెషల్ ఆఫీసర్‌గా పిలిచిన వారు, ఇప్పుడు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పేరు మార్చారు.
- కడా ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేయడానికి కడా పీడీ నేరుగా బాధ్యత వహిస్తారు. కడా పరిధిలోని అన్ని లైన్ డిపార్టుమెంట్లు అంటే ప్రభుత్వ శాఖల అధికారుల సకల విధులు, బాధ్యతలను పీడీ సమీక్షించి పర్యవేక్షిస్తారు. ఆయా కార్యక్రమాల ద్వారా స్థూల ఆర్థిక వృద్ధిని సాధించడానికి అనువైన కార్యక్రమాలు, ప్రాజెక్టులు, పథకాలను రూపొందించి అమలు చేస్తారు. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను విధించుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా కడా వ్యవహరిస్తుంది. పీ-4 విధానం (అంటే పబ్లిక్, ప్రైవేట్, వ్యక్తులు, భాగస్వామ్యం) అనుసరించడం ద్వారా పేదరికంలేని సమాజ నిర్మాణంకోసం కృషి చేస్తుంది.
- సబ్ కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ టైమ్ స్కేల్‌లోని ఏపీ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిని కడా పీడీగా నియమిస్తారు.
- జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. పీడీ నేరుగా కలెక్టర్‌కు నివేదించాలి.
- ప్రణాళిక, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్ బి, నీటి వనరుల అభివృద్ధి, విద్యుత్తు, డీఆర్డీయే పాఠశాల, ఉన్నత విద్యాశాఖలు, ఆరోగ్యం, వ్యవసాయం, సంక్షేమం, పౌర సరఫరాలు, హౌసింగ్, వంటి 17 ప్రభుత్వ లైన్ డిపార్టుమెంట్లు కడా పరిధిలోకి వస్తాయి. కడా ప్రాంతానికి అవసరమైన అధికారాలు, బాధ్యతలు కలిగిన డివిజనల్ స్థాయి అధికారులను ఆయా డిపార్టుమెంట్లు కడా పరిధిలో నియమించాలి.
- కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారితో సహా, కడా ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందరూ కడా పీడీ పరిపాలనా నియంత్రణలోనే ఉంటారు.
- కడా పీడీ తన కుప్పం ప్రాంత అభివృద్ధిని లక్ష్యం చేసుకుని నిర్వహించే సమీక్షలకు, ఆ పరిధిలో పనిచేస్తున్న సంబంధిత అధికారులు, సిబ్బందితో సహా తప్పనసరిగా హాజరు కావాలి.
- రెవెన్యూ డివిజన్‌తో అనుబంధంగా లేని పరిశ్రమలు, ఐటీ, ఎండోమెంట్స్ వంటి ప్రభుత్వ విభాగాలు ఆయా విభాగాలలోని సీనియర్ అధికారిని కడా పీడీ నిర్వహించే సమీక్షలకు విధిగా పంపాలి.
- ఆర్డీవోతో సహా కడా ప్రాంతంలో పనిచేస్తున్న అన్ని గెజిటెడ్ అధికారుల సాధారణ సెలవులు, టీఏ బిల్లులను కడా పీడీ ఆమోదిస్తారు.
- ఏదైనా రికార్డులను అడగడానికి, కడా పరిధిలని ఏదైనా నియంత్రణ, అభివృద్ధి పనులను తనిఖీ చేయడానికి లేదా సమీక్షించడానికి పీడీ అధికారం కలిగి ఉంటారు.
- కడా ప్రాంతంలో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులపై వచ్చే ఆరోపణల విషయంలో విచారణాధికారాన్ని కడా పీడీ అధికారం కలిగి ఉంటారు.
- అన్ని డివిజనల్ స్థాయి అధికారుల పనితీరుపై వార్షిక రహస్య నివేదికలను కడా పీడీ కలెక్టర్‌కు నివేదిస్తారు. అలాగే మండల స్థాయి అధికారుల వార్షిక రహస్య నివేదికపై సంతకం చేసే అధికారం కలిగి ఉంటారు.
- మున్సిపాలిటీ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ ఆయా పథకాలు, పనులు పర్యవేక్షించడానికి కడా పీడీ నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు కావాలి.
- కడా కార్యాలయానికి వివిధ కేడర్లకు చెందిన 19 మంది సిబ్బందిని కేటాయించారు. కడా పీడీతో పాటు డిప్యూటీ కలెక్టర్ కేడర్ కుచెందిన అడిషనల్ పీడీ ఒకరు, తహాశీల్దారు ఒకరు, డిప్యూటీ తహాశీల్దారు ఒకరు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పీఎంయూ బృందం ఇద్దరేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నలుగురు కార్యాలయ ఉప సిబ్బంది, ఇద్దరు వాచ్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లను కేటాయించారు.
- కడాకోసం ఆర్థిక శాఖ వార్షిక బడ్జెట్‌ను మంజూరు చేస్తుంది.

జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా పనిచేద్దాం

అధికారులకు ఎంపీ దగ్గుమళ్ల పిలుపు



కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి సమీక్షిస్తున్న చిత్తూరు ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 10: జిల్లా ప్రతిష్ఠ పెరిగేలా అందరం కలసికట్టుగా పనిచేసి.. అభివృద్ధి చేద్దామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్‌తో కలిసి జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా మంజూరయ్యే అన్ని పనులను నాణ్యతతో పూర్తిచేయాలని, ఇందుకు సంబంధించిన విధివిధానాలను అన్నిశాఖలు పాటించాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఖర్చుచేసే ప్రతి పైసా క్షేత్రస్థాయిలోని పేదలందరికీ చేరేలా పాలన అందిద్దామన్నారు. కేంద్ర నిధులతో అమలవుతున్న ఉపాధి హామీపథకం, జలజీవన్ మిషన్, నేషనల్ హెల్త్ మిషన్, అమృత్‌సరోవర్‌తో పాటు వివిధ శాఖల ద్వారా చిత్తూరు లోక్‌సభ పరిధిలో చేపడుతున్న పథకాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎంపీకి కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, జడ్పీ సీఈవో ఎస్.గ్లోరియా, హౌసింగ్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు పద్మనాభం, తులసి, రాధమ్మ, డీపీవో లక్ష్మి, టిడ్కో ఈఈ వెంకటముని, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అర్జీలు పరిశీలించండి

ముఖ్యమంత్రి చంద్రబాబు గతనెలలో జరిపిన కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీలను పరిశీలించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో అర్జీల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యల గురించి జేసీ శ్రీనివాసులుతో కలసి సమీక్షించారు. అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సర్వీసు, ఆర్థిక సంబంధిత అర్జీలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఈనెల 20న తదుపరి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి!

● ఆడిట్ అధికారుల తీరుపై ఫిర్యాదుదారుల ఆగ్రహం

చిత్తూరు రూరల్, జూలై 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై విచారణకు సంబంధించి మరిన్ని దస్త్రాలు లేకుండానే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసినట్లు తెలిసింది. ఈ మేరకు నివేదిక కూడా సమర్పించినట్లు సమాచారం. దీనిపై ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీ సీఈవో (ఎఫ్‌ఏసీ)గా ప్రభాకర్‌రెడ్డి అనేక అక్రమాలకు పాల్పడ్డారంటూ విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కలెక్టరు షన్మోహన్ ఆదేశాలతో గత నెల నుంచి జిల్లా ఆడిట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఆడిట్ అధికారులు అడిగిన దస్త్రాలను జడ్పీ అధికారులు అందిస్తూ వచ్చారు. విచారణకు కావాల్సిన మరికొన్ని దస్త్రాలు సమర్పించకనే ఆడిట్ అధికారులు విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. పూర్తి దస్త్రాలు లేకుండానే విచారణ పూర్తి చేయడంపై పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిగిన ఆడిట్‌లోనూ జడ్పీలో ఎటువంటి అక్రమాలు చోటు చేసులేదని అధికారులు క్లీన్ చిట్ ఇస్తూ వచ్చారు. అయితే జడ్పీలో ప్రభాకర్‌రెడ్డి సీఈవో ఉన్న సమయంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికి అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో విచారణ చేసేందుకు అధికారులు ముందుకు రాలేదు. దీంతో వారు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గత రెండు నెలలుగా విచారణ మందకొడిగా సాగుతూనే ఉంది. రెండు రోజులు విచారించి.. నాలుగు రోజులు పట్టించుకునే వాళ్లు కాదు. కానీ, ఇప్పుడు విచారణ పూర్తయిందని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

ఏసీబీ వలలో విలేజ్ సర్వేయర్



సర్వేయర్ గణేష్

సత్యవేడు, జూలై 10 : పొలం హద్దుల గుర్తింపు కోసం రైతు నుంచి లంచం తీసుకుంటున్న ఓ సర్వేయర్‌ను బుధవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కథనం మేరకు... తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కన్నవరం గ్రామానికి చెందిన వేమల భాస్కర్ తన పిత్రార్జితమైన భూమికి సంబంధించి ఎఫ్-లైన్ సర్వే రిపోర్టు(హద్దుల గుర్తింపు) కోసం సంబంధిత సచివాలయంలో ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సర్వేకోసం ట్రెజరీలో చలానా చెల్లించి సర్వేయర్ గణేష్‌ను కలిశాడు. సర్వే చేయాలంటే రూ.ఆరువేలు తనకు ఇవ్వాలని సర్వేయర్ గణేష్ డిమాండ్ చేశాడు.దీంతో భాస్కర్ ముందస్తుగా రూ. రెండు వేలను తన బావమరిది ఫోన్ నుంచి ఫోన్‌పే చేశాడు.మరోవైపు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం సర్వేయర్ గణేష్ రైతు భాస్కర్ నుంచి రూ.4వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గణేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.ఎస్‌ఐలు ఈశ్వర్, సునీల్, శివనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ కన్నుమూత



జయసింహులు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 10: ఎస్వీయూనివర్సిటీ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ వల్లేరు జయసింహులు నాయుడు (76) మృతి చెందారు. నెల రోజులుగా ఊపిరితిత్తుల సంబంధ జబ్బుతో బాధపడుతూ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. బంగారుపాళ్యంకు చెందిన ఆయన ఎస్వీయూనివర్సిటీలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో ప్రతిష్ఠాత్మక పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ అండ్ డెవెలప్‌మెంట్ విభాగాన్ని స్థాపించారు. సీఎం చంద్రబాబు నాయుడుకు సన్నిహితులు.జయసింహులు నాయుడు కుటుంబం తిరుపతి పద్మావతి నగర్‌లో నివాసం ఉండేది. సతీమణి పార్వతి పద్మావతి యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. వీరి కుమారై అమెరికాలో స్థిర పడ్డారు.ప్రొఫెసర్ జయసింహులు నాయుడు మృతికి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ చైర్మెన్ పాండ్ర సురేంద్ర నాయుడు, నందనం అకాడమీ డైరెక్టర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జయసింహులు నాయుడు భౌతిక కాయానికి గురువారం మధ్యాహ్నం గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

సీఎం చంద్రబాబు సంతాపం : జయసింహులు నాయుడు మృతికి సీఎం చంద్రబాబు సంతాపాన్ని వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో జయసింహులు నాయుడుతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఎంతో మంది విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దారని ఒక ప్రకటనలో నివాళులర్పించారు. తన రచనలు, ప్రసంగాల ద్వారా అనేక మందికి మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. ఆయన. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



రేణిగుంట, జూలై 10: తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్లో స్పెషల్ పార్టీ పోలీసులు 43 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాజులమండ్యం సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.... 15రోజులుగా గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో పోలీసులు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 43కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా, బుధవారం మాత్రమే 12కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో, రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు.

కౌన్సిల్ గొంతుమారింది

నగరాభివృద్ధికి కలసి పనిచేద్దామని రాజకీయాలకతీతంగా పిలుపు - ఎమ్మెల్యేకి అభినందనల వెల్లువ



సమావేశ ప్రారంభంలో మేయరు పక్కన ఎంపీ, ఎమ్మెల్సీ, కమిషనర్ - ఎమ్మెల్యే శ్రీనివాసులు సూచన తరువాత దూరంగా కూర్చున్న ఎంపీ,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మారిన స్వరాలు

తిరుపతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీరు మారింది. కొందరు వైసీపీ కార్పొరేటర్ల స్వరం మారింది. పలువురు గత వైసీపీ పాలనపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చగా మారింది.మొత్తానికి కార్పొరేటర్లు స్వేచ్ఛగా తమ భావాలను పంచుకునేందుకు బుధవారం నాటి కౌన్సిల్ భేటీ వేదికగా మారింది. మేయర్‌కు తగిన గౌరవం దక్కడంతో ఆమె కళ్లలో ఆనందం కనిపించింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా వచ్చిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు, ఎంపీ గురుమూర్తికి పార్టీలకతీతంగా అభినందనలు తెలపడం కౌన్సిల్ గౌరవాన్ని పెంచింది. తిరుపతి అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి రాజకీయాలకతీతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు. టీడీఆర్ బాండ్లపై వస్తున్న ఆరోపణలపై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్పొరేటర్లు తెలియజేసే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని కమిషనర్ అదితిసింగ్ తెలిపారు.

మేయర్‌కు దక్కిన గౌరవం



తిరుపతి ప్రథమ పౌరురాలు, మేయర్ శిరీషకు కౌన్సిల్ సమావేశంలో తగిన గౌరవం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తమ పార్టీకే చెందిన మేయర్ శిరీషను గాజుబొమ్మను చేసి కూర్చోబెట్టారన్న విమర్శలొచ్చాయి. మేయర్ కుర్చీకి ప్రాధాన్యత ఇవ్వకుండా పక్కన ఎమ్మెల్యేతో పాటు కమిషనరు కూర్చోవడం అనేక ఆరోపణలకు తావిచ్చిన విషయం తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బుధవారం తొలి సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో సమావేశానికి హాజరయ్యారు. అప్పటికే వేదికపై మేయర్‌కు అటూ,ఇటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ అదితిసింగ్ ఆశీనులయ్యారు. ఎమ్మెల్యేకి కూడా మరొక కుర్చీని వేసి వుంచారు. సమావేశం ప్రారంభమవుతుండగా ఎమ్మెల్యే సెనేట్ హాలుకు చేరుకున్నారు. వేదికపైన ఉన్న తన కుర్చీని కిందవేయమని అధికారులకు సూచించారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ కూడా కిందకు దిగేశారు. కమిషనర్ మాత్రం మేయర్ పక్కనే కూర్చుండిపోయారు.మేయర్‌తో సమానంగా ఎవ్వరూ కూర్చోవద్దని, ఆ కుర్చీకి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలని, కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లమని ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డిని ఎమ్మెల్యే పిలిచి చెప్పారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ తన కుర్చీ స్థానాన్ని కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు మేయర్‌కు దక్కిన గౌరవాన్ని చర్చించుకోవడం కనిపించింది. ఇంతలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ లేచి తమ కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యక్తిత్వానికి ఇలాంటి ఘటనే నిదర్శనమన్నారు. పార్టీలకతీతంగా గౌరవించడం ఎన్డీఏ నేతల అభిమతమన్నారు. ఇకపై కార్పొరేటర్లు కూడా వారి డివిజన్లలో స్వేచ్ఛగా ప్రజలకు సేవలందించవచ్చన్నారు. పలువురు అభినందనలు తెలపడంతో మేయర్ కళ్లలో ఆనందం కనిపించింది.

ఐదేళ్లు నరకమనుభవించాం



కార్పొరేషన్లో గత ఐదేళ్లు నరకం అనుభవించాం. ప్రజలు కట్టిన పన్నులకు లెక్కలు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కార్పొరేషన్లో మాకు తెలియకుండా చాలా జరిగిపోయాయి. అందుకే ప్రజలు భారీ మెజారిటీతో జనసేన పార్టీని గెలిపించారు. కార్పొరేషన్‌లో అవినీతిపై విచారణ జరిపించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు ఫిర్యాదు చేస్తాం.

- డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

కార్పొరేటర్ అంటే ఇంతకాలం తెలియలేదు

ఇంతకాలం కార్పొరేటర్ అంటే ఏమిటో ఎవరికీ తెలియలేదు. ఇప్పుడైనా మనమేంటో తెలుసుకోవాలి. టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విచారణ జరిపించి, వాస్తవాలు ప్రజలకు తెలపాలి. మాస్టర్ ప్లాన్ రోడ్లు నాణ్యత పరీక్షించిన తర్వాతే పెండింగ్ బిల్లులు చెల్లించాలి. డబుల్ డెక్కర్ బస్సును కంపోస్టుయార్డులో పెట్టడం బాధాకరం. దానిని అందుబాటులోకి తీసుకురావాలి. గతంలో శ్రీకృష్ణ దేవరాయల కాంస్య విగ్రహాన్ని తొలగించి, ఎక్కడో పడేసి, ఆ స్థానంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఫైబర్ విగ్రహం పెట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీశాం.

- దొడ్డారెడ్డి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్

రేపు ఆలయ భూముల కౌలు హక్కులు వేలం

గుర్రంకొండ, జూలై 10:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల కౌలు హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. శెట్టివారిపల్లె, జర్రావారిపల్లె, తరిగొండ గ్రామాల్లోని ఈ భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకోవడానికి ఈ నెల 12న శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో వారాహి నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో గాయత్రిదేవి

మదనపల్లె అర్బన్, జూలై 10: వారాహి నవరాత్రుల్లో భాగంగా చిప్పిలి అయప్పస్వామి ఆలయంలో బుధవారం గాయత్రీ దేవిని పండ్లు, కూరగాయలతో అలంకరించి, అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణ ప్రముఖులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన 'రామాంజనేయ యుద్ధం'


నాటకం ప్రదర్శిస్తున్న పాళంవారిపల్లె వాసులు

మదనపల్లె అర్బన్, జూలై 10: స్థానిక టిప్పు సుల్తాన్ మైదానంలో మంగళవారం రాత్రి మదనపల్లె మండలం, పాశంవారిపల్లె వాస్తవ్యులు రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. మహా భారత యజ్ఞం కమిటీ సభ్యుడు డాక్టర్ రామచంద్ర నాయుడు, బీజేపీ వెంకటేశ్ , వేల్పుల శ్రీధర్ పర్యవేక్షించారు.

వైభవంగా కనకదుర్గమ్మ జాతర


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

రామసముద్రం, జూలై 10: మండల కేంద్రంలోని గాజుల నగరంలో బుధవారం కనకదుర్గమ్మ జాతర నిర్వహించారు. మహిళలు ఉపవాసాలతో దీపాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కేరళ వాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముందు ముగ్గులు, పచ్చని తోరణాలు దర్శన మిచ్చాయి.

రిటైర్డు ఉపాధ్యాయుడికి సన్మానం


రిటైర్డు ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు

ములకలచెరువు, జూలై 10: ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు నాగరాజును ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో జరిగిన సన్మాన సభలో ఎంఈవో వెంకటరమణ, సీఐ మధు, సెట్ సీఐ రామ్మోహన్, హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు హేజర్లై, నాగరాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన దగ్గుబాటి


సీఎం చంద్రబాబును కలిసిన దగ్గుబాటి దంపతులు

కలకడ, జూలై 10: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం జిల్లా టీడీపీ కార్యదర్శి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కలిశారు. అమరావతి సచివాలయంలోని సీఎం చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో ఆయన సతీమణిశారదమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ..

బి.కొత్తకోట, జూలై 10: మండలంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాదిహామీ పనులపై సామాజిక తనిఖీ చేసేందుకు రంగం సిద్ధమైంది. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి, ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులు, సామాజిక పింఛన్లు పై ఈ బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయనుంది. ఇందులో భాగంగా గురువారం మండల ఎరిషత్ కార్యాలయ ఆవరణలో సమీక్షాసమావేశం న్విహించనున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్, ఏపీవో మంజుల తెలిపారు

ప్రభుత్వాస్పత్రి నుంచి రెఫరల్స్ తగ్గించాలి

● ఎమ్మెల్యే: షాజహాన్‌బాషా


సర్వజన బోధనాస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 10: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి నుంచి సీరియస్ కేసులు రెఫర్ చేయకుండా సాధ్యమైనంత వరకు ఇక్కడే మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక సర్వజన బోధనాస్పత్రిని ఎమ్మెల్యే ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీతో పాటు, బ్లడ్‌బ్యాంకు, అన్ని విభాగాల అవుట్ పేషెంట్ వార్డులు పరిశీలించారు. ఇన్‌పేషంట్ వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోందని, దీనికి తగ్గట్టు వైద్యులు అందుబాటులో ఉన్నారా అని ప్రశ్నించారు. తక్కువ సంఖ్యలో వైద్యులు ఉంటే మెడికల్ కళాశాలకు బదిలీపై వచ్చిన ప్రొఫెసర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో పారిశుధ్యంపై అసహనం వ్యక్తం చేశారు. మదనపల్లె పట్టణంలో ఆరోగ్యశ్రీ ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు అనవసరంగా కేసులు పెంచి ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేస్తున్నాయని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ ఆస్పత్రి స్థాయి పెరిగిందని, దీనిక తగ్గట్టు పారిశుధ్య కార్మికులను నియమించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య కార్మికులతో అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదన్నారు. నర్సులు మాట్లాడుతూ తమకు మూడు నెలల నుంచి జీతాలు రాలేదన్నారు. పారిశుధ్య కార్మికులు, ఐటీయూసీ అధ్యక్షుడు జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ తమకు 5 నెలల నుంచి వేతనాలు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆర్ఎంవో ప్రసాదరాజు, టీడీపీ నాయకులు షంషీర్, జేసీబీ మధు, మార్పూరి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

చిన్నమండెం, జూలై 10: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి చొరవతో 10 సంవత్సరాల కిందట ఆగిన ఆర్టీసీ బస్సు సర్వీసును బుధ వారం పునరుద్ధ రిం చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వండాడి మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి గ్రామస్తులతో కలిసి రాయచోటి నుంచి వండాడి, చాకిబండ, దిగువగొట్టివీడు మీదుగా గాలివీడుకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కొన్నిరోజుల కిందట అభ్యర్థించడంతో మంత్రి చొరవ తీసుకొని ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం నుంచి ప్రారంభించారు. మూడు షిఫ్టులతో రాయచోటి-వండాడి మీదుగా చాకిబండ, దిగువగొట్టివీడు, గాలివీడు వరకు ప్రారంభించారు. దాదాపు పదేళ్ల తర్వాత తిరిగి ప్రారంభం కావడంతో ఊరూరా బస్సులకు హారతులు, కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. అనంతరం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి

చిట్వేలి, జూలై 10: సకాలంలో పన్నులు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ తెలిపారు. చిట్వేలి పంచాయతి కార్యాలయాన్ని ఆమె బుధవారం పరిశీలించి పన్నుల వసూళ్లపై పలు సూచనలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం విషయంలో తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చిట్వేలి ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డిని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో పార్వతి, ఈవోపీఆర్డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నరసింహ, శివ కుమార్, వెంకటేశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా విధులు నిర్వహించండి

● అంగన్‌వాడీ కార్యకర్తలతో.. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ



అంగన్‌వాడీ వర్కర్లకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ

మదనపల్లె టౌన్, జూలై 10: అన్నమయ్య జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఇకమీదట ప్రాజెక్టులతో సంబంధం లేకుండా అంగన్‌వాడీ సెంటర్లు తనిఖీలు చేస్తారని ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగా వేళలు పాటించాలని, బాలింతలు, గర్భిణులకు మెనూ ప్రకారం వండి పెట్టాలన్నారు. నెలలో మొదటి, మూడో శుక్రవారాల్లో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రక్తహీనత నివారణ, బాల్యవివాహాలు అడ్డుకోవడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇతర ప్రాజెక్టులు తనిఖీలు చేసినప్పుడు సీడీపీవోలు కూడా పారదర్శకత పాటించాలని, ఆయా అంగన్‌వాడీ సెంటర్లలో లోటుపాట్లతో పాటు సత్ఫలితాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 10,268 మంది గర్భిణులు, 9,209 మంది బాలింతలు ఉండగా వారిలో 860 మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, 1,391 మంది పిల్లలు తక్కువ బరువు కలిగి ఉన్నారన్నారు. వీటిని అధిగమించడానికి వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో మదనపల్లె సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్లు చంద్రకాంత, భానులక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బాహుదా ప్రాజెక్టు నీటి మట్టంపై ఆర్డీవో ఆరా..


బాహుదా ప్రాజెక్టును సందర్శిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్, తదితరులు

నిమ్మనపల్లి, జూలై 10: మండలంలోని బాహుదా ప్రాజెక్టును బుధవారం మదనపల్లి ఆర్డీవో హరిప్రసాద్ సందర్శించి నీటి మట్టంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాహుదా ప్రాజెక్టు ఆయకట్టుదారులు నీటి తీరువాను చెల్లించి ప్రాజెక్టు అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. ఒక్కసారి పూర్తి స్థాయిలో బాహుదా నిండితే తాగు, సాగునీటి కొదవ ఉండదని, మూడు మండలాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కాలువల మరమ్మతులకు ప్రభుత్వంతో పాటు ఆయకట్టు రైతులు కూడా ఎకరాకు రూ.200ల చొప్పున నీటితీరువా చెల్లించాలన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి, పంటలు పండినపుడు మాత్రమే నీటితీరువా ఇవ్వాలని తెలిపారు. బాహుదా ఆయకట్టు 2880 ఎకరాలు కాగా , ప్రాజెక్టు లోపలి భాగంలో దాదాపు 400 వందల ఎకరాలు ఉంటుందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌రాజు, ఇరిగేషన్ ఏఈ శ్రీహరి రెడ్డి, ఆర్ఐ రాంప్రసాద్, వీఆర్వోలు గ్రామ సేవకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

వాల్మీకిపురం, జూలై 10: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, కలికిరి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, సీడీపీవో భారతికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేయడంతో పాటు అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలను వేధిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలనిన కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు భూకైలేశ్వరి, ప్రధాన కార్యదర్శి అమ్మాజీ, చంద్రావతి, నజీమున్నీసా, సంపూర్ణ, శ్రావణి, గుల్జాం, గాయత్రి, సురేఖ, వసుంధర, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో ఘనంగా డిమాండ్స్ డే

బి.కొత్తకోట: జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం వద్ద బి.కొత్తకోట, పీటీయం, ములకల చెరువు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గానికి వర్తించే విధంగా నాలుగు లేబర్‌కోడ్లు పెట్టిందని, సంఘాలు పెట్టుకోకుండా, సమ్మెలు చేయకుండా కార్మికులను బానిసలుగా మార్చేందుకు ఈ లేబర్‌కోడ్‌లు తెచ్చిందన్నారు. స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసవేతనం రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికసంఘం జిల్లా నాయకులు వీరప్ప, అంగన్వాడీ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమారి, శ్రీవాణి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై మక్కువ చూపాలి

పెనగలూరు, జూలై 10: మండలంలోని వ్యవసాయ పలాలు ఆయిల్‌సాగుకు అనుకూలమైనవని రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పాం సాగు చేసుకోవాలని రాజంపేట ఉద్యానవన శాఖ అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. బుధవారం కట్టావారిపల్లె, ఈటమాపురం, సింగారెడ్డిపల్లె గ్రామాల్లో జరిగిన రైతుల సమావేశంలో ఆయన ప్రజలకు ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏడాదికి రూ.5150 వంతున నాలుగేళ్లకు రూ.21 వేల ఆర్థికసాయం, అంతర పంటల సాగు కోసం మరో రూ.20 వేల ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. ఇవి రెండు పూర్తిగా రైతులకు ఉచితంగా ఇవ్వనున్నామని, అవకాశాలను మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఎస్ ఆగ్రో ఇండస్ట్రీ మేనేజర్ కొండారెడ్డి, వీహెచ్ఏ షమివలీ, వీఏఏ సునీల్‌కుమార్, సర్పంచ్ పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు వద్దు.. సంక్షేమమే ముద్దు


వాల్మీకిపురంలో నాయకులతో మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 10: గ్రామాల్లో కక్ష సాధింపు చర్యలొద్దని అభివృద్ధి, సంక్షేమంతో ముందుకెళ్లామని నియోజకవర్గ టీడీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వాల్మీకిపురం మార్కెట్ కమిటీ సమావేశ భవనంలో పీలేరు నియోజకవర్గ టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, రాజేంద్రాచారి, చంద్రమౌళి, పీవీ తదితర నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోవు ఐదేళ్లలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని, వాల్మీకిపురంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పథకాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీకి ఘన విజయాన్ని తెచ్చి పెట్టిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు గాంధీపేట రమణ, కృష్ణారెడ్డి, పులి సత్యారెడ్డి, రాజేంద్రాచారి, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, జనసేన ప్రభాకర్, ఖలందర్, , జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ తనిఖీలు


తనిఖీ చేస్తున్న ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్

మదనపల్లె టౌన్, జూలై 10: పట్టణంలో ఆరోగ్యశ్రీ గుర్తింపు పొందిన రెండు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పొందుతున్న రోగుల సంఖ్యను లెక్కించి, రికార్డులతో సరిపోల్చుకున్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ చికిత్స పొందుతున్న రోగుల లైవ్ లోకేషన్స్‌ను పరిశీలించామన్నారు. రెండు ఆస్పత్రుల్లో 52 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారన్నారు. దీంతో పాటు రోగుల వద్ద ఆస్పత్రి సిబ్బంది ఏదైనా అదనంగా డబ్బు వసూలు చేశారా, భోజనం నాణ్యత, డిశ్చార్జి తరువాత ఆరోగ్య శ్రీ ఆసరా నగదు ఇస్తున్నారా లేదా తదితర అంశాలపై రోగుల నుంచి ఆరా తీశామన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన


మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, జూలై 10: పట్టణంలోని కనకదాస్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళలు ఆందోళన చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంబాయి- చైన్నై జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో ఏడాదిగా అమ్మచెరువు మిట్ట, చంద్రకాలనీ, జహా చేనేత నగర్, సిరికల్చర్ కాలనీ, కనకదాస్ నగర్ కాలనీలకు మున్సిపాలిటీ తాగునీరు సరఫరా నిలిపి వేసిందని, అప్పటి నుంచి ప్రైవేటు ట్యాంకర్లు కొనుగోలు చేస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నెలకు నాలుగు ట్యాంకర్లు అవసరం అవుతాయని, ఒక్కో ట్యాంకును రూ.600లతో కొనుగోలు చేస్తే నెలకు రూ.2,400లు భారం పడుతుందని వాపోయారు. జాతీయ రహదారి పనులు పూర్తి అయినా మున్సిపాలిటీ వారు కనకదాస్ నగర్‌కు తాగునీరు సరఫరా చేయలేదన్నారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, జూలై 10: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో పోలప్ప సూచించారు. ములకల చెరువులోని వినాయకనగర్‌లో బుధవారం జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లోని మురుగు కాలువలను పంచాయతీ కార్యదర్శులు విధిగా శుభ్రం చేయించాలన్నారు. ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగునీటి కుళాయిల్లో వదలాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించాలి

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులతో మాట్లాడి సాగుకు ప్రోత్సహించాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచి పని అడిగిన వారికి కచ్చితంగా పనులు కల్పించాలన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

కలకడ, జూలై 10: స్టాప్ డయేరియా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎర్రకోటపల్లె ఆసుపత్రి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లె గ్రామస్థులకు వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఓఆర్ఎస్ ఉపయోగాలను వివరించి పాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమం గోడ పత్రికలను ఆవిష్కరించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వరరావు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీని కలిసిన ఎంఈవోలు


ఆర్జేడీ శామ్యూల్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు

పెద్దతిప్పసముద్రం జూలై 10: పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) శామ్యూ ల్‌ను బుధవారం కడప జిల్లాలోని ఆయన కార్యాలయంలో పీటీఎం, పెద్దమండ్యం, కురబలకోట మం డలాలకు చెందిన ఎంఈవోలు నారాయణ, పి.మనోహర్, ద్వారకనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులనుఆయనకు వివరించారు. నాడు-నేడు పనులను వేగవంతం చేసి, నిర్మాణాల పూర్తికి సహకరించాలని కోరారు.

దౌర్జన్యంగా భూమి ఆక్రమించుకున్నారని ఫిర్యాదు

వాల్మీకిపురం, జూలై 10: తాను సాగు చేసుకుంటున్న భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన రామనారాయణరెడ్డి బుధవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. 1986లో ఖాతా నెంబరు 62456లో 2.74 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు తమకు ఇచ్చారని, అప్పటి నుంచి తమ కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోందని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. తమ గ్రామానికే చెందిన నరేష్ అనే వ్యక్తి కొద్దిరోజుల క్రితం తాము సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ రెవెన్యూ రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపినట్లు బాధిత రైతు చెప్పాడు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

తంబళ్లపల్లె, జూలై 10: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందచేయాలని మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, కరుణాకర్ కోరారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మండలంలోని పరసతోపు, కోసువారిపల్లె సచివాలయాలను సందర్శించారు. అనంతరం స్థానిక పోలీస్టేషన్‌లో ఎస్ఐ శివకుమార్‌ను కలసి ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధమ్మ, సోముశేఖర్, హరినాథ్‌రెడ్డి, జయరాంరెడ్డి, సురేష్, రాజారెడ్డి, మురళి, సాంబశివారెడ్డి, లక్ష్మయ్య, శంకర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రఘునాథ్, మ్యూజికల్‌శివ, భార్గవ్‌రెడ్డి, బీసీ కృష్ణమూర్తి, రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన



ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేస్తున్న మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోల అధికారులు

మదనపల్లె అర్బన్, జూలై 10: స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో బుధవారం వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా డీఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో జూన్‌లో ఓఆర్ 70 శాతం సాధించి రీజియన్‌లో ప్రథమస్థానంలో, కేఎంపీఎల్ 5.39 సాధించి ద్వితీయ స్థానంలో నిలిపినందులకు ఆర్టీసీ ఉద్యోగులను అభినందించారు. టార్గెట్ సాధించినవారిలో మొదటి బహుమతి రూ. 500లు కెసీ మస్తాన్‌కు, ద్వితీయ బహుమతి రూ.400లు జి.కమలమ్మకు, తృతీయ బహుమతి రూ.300లు జి. అమరావతికి అందజేశారు. అదిక ఈపీకే సాధించిన ఎం. నాగరాజు, పీవీబీ రెడ్డి, బీసీ నాయక్‌లను అభినందించారు. కార్యక్రమంలో జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాద్, అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, బాబ్ జాన్ పాల్గొన్నారు. ఆర్టీసీ టూ డిపోలో అసిస్టెంట్ మేనేజరు గీత ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. టూ డిపో గేట్ వద్ద జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులు టి. సీతారాం, వి. వీరయ్య, ఏవీ రాజుకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించి అభినందనలు తెలిపారు. .